

కందారపు మురళి ఆరోగ్యం విషమం

రుయా వైద్య బృందం వెల్లడి



ప్రజాశక్తి - తిరుపతి టిటిడి అటవీ కార్మికులకు మద్దతుగా నిరవధిక దీక్ష చేపట్టిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళితో పాటు, అటవీ కార్మికుల ఆరోగ్యం మరింత విషమించిందని రుయా వైద్య బృందం డాక్టర్లు హారిక ,ఉష, పథ్వి ప్రకటించారు. సోమవారం రాత్రి దీక్షా శిబిరం వద్దకు చేరుకున్న వైద్య బృందం కార్మిక నేతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్ లెవల్స్ పడిపోయాయని, ఇలాగే కొనసాగితే ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని వెల్లడించారు. అయితే అటవీ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తాము దీక్ష విరమించబోమని, అవసరమైతే ప్రాణ త్యాగం చేయడానికైనా వెనకాడబోమని కందారపు మురళి స్పష్టం చేశారు.



మురళిని శిబిరం నుంచి బలవంతంగా తీసుకెళుతున్న పోలీసులు



ఎమ్మెల్యే ఆదిమూలంది రాజకీయ ఆత్మహత్య

మీడియాతో మంత్రులు ఆర్కే రోజా, పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాలుగో కష్టుడిగా కాంగ్రెస్ పార్టీలోకి వైఎస్ షర్మిల ప్రవేశించారని రాష్ట్ర మంత్రులు ఆర్కే రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. తిరుపతిలోని ఓ హెూటల్లో సోమవారం మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి కుమార్తెగా షర్మిలాను అభిమానులు గౌరవిస్తారని, కానీ కుటుంబాన్ని చీల్చిన పార్టీతో, రాష్ట్ర విభజనతో ఆంధ్ర ప్రదేశ్ ను అధోగతి పాలుచేసిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరడం శోచనీయమన్నారు. తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరును ఎఫ్ఐఆర్ లో చేర్చిన కాంగ్రెస్ పార్టీతో వైయస్ షర్మిల జతకట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ చంద్రబాబు కుయుక్తులు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంతా తెలుసన్నారు. తనకు మళ్ళీ ఛాన్స్ కావాలని ప్రజల్లోకి వస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం రాజకీయంగా తనకు అన్ని విధాలా సహకరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ, వైఎస్ఆర్సి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ తనకు తానే రాజకీయ ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాబోవు ఎన్నికల వైఎస్ఆర్సిపి క్లీన్ స్వీప్ చేస్తుందని, జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

తిరుపతి వైసిపి ఎంపి అభ్యర్థిగా రాజేష్

విమర్శించినందుకే ఆదిమూలంకు చెక్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ పరిణామాలు ఊపందుకుంటున్నాయి. సత్యవేడు ఎంఎల్ఎ ఆదిమూలంకు 'స్థానికం'గా కొర్రి పెట్టారు. జిల్లాలో ఎవరూ చేయని విధంగా అధిష్టానం ఆదేశాల మేరకు 600 రోజుల పాటు గడప గడప కార్యక్రమం నిర్వహించి ప్రజలకు చేరువయ్యానని, మంత్రి పెద్దిరెడ్డి జోక్యంచేసుకుని తనకు సీటు బదలాయింపు చేశారని తారాస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ జరిపిన సర్వేలో ఆదిమూలంకు గెలిచే పరిస్థితి లేదని నివేదిక రావడంతో తిరుపతి ఎంపి అభ్యర్థిగా బదిలీ చేశారు. తనపై నియోజకవర్గంలో వ్యతిరేకత లేనప్పటికీ కావాలనే గురుమూర్తికి అవకాశం కల్పించడానికి తనను పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఈ విషయమై మీడియా ఎదుట ఆదిమూలం వాపోయారు. దీంతో పెద్దిరెడ్డి సీరియస్ అయ్యారు. తిరుపతి ఎంపి అభ్యర్థిగా ఆదిమూలంను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రకటించినప్పటికీ, మంత్రిపై విమర్శలు చేయడంతో రాజకీయంగా ఆదిమూలంకు చెక్‌పెట్టారు. జీడీనెల్లూరు టిక్కెట్ ఆశిస్తున్న మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ చెల్లెలి కొడుకు రాజేష్‌కు 'స్థానికంగా' సీటు భంగం కలిగింది. దీంతో పెద్దిరెడ్డి రాజేష్‌ను ఆదివారం రాత్రి ఇంటికి పిలిపించి తిరుపతి ఎంపి అభ్యర్థిగా పోటీ చేయాలని అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. అందుకు రాజేష్ సుముఖత వ్యక్తం చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో తిరుపతి వైసిపి ఎంపి అభ్యర్థిగా రాజేష్‌ను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ఆదిమూలంకు అటు ఎంఎల్ఎగానూ, ఎంపిగానూ రెండు అవకాశాలను కోల్పోయారు.

అటవీ కార్మికుల సమస్య పరిష్కరించకుంటే...

ఉద్యమం.. ఉధృతం..!

దీక్షకు సిహెచ్ నర్సింగరావు సంఘీభావం

జిల్లావ్యాప్తంగా సిఐటియు నిరసనలు




దీక్షా శిబిరం వద్ద మద్దతిస్తున్న మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



ఐలు నాయకులు మురళి సంఘీభావం

1160 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం చేయకపోవడం దారుణమని, జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లకు అన్యాయం చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఈ తప్పును టీటీడీ యాజమాన్యం సరిదిద్దుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేయడానికి తాము వెనుకాడేది లేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు హెచ్చరించారు. సోమవారం టిటిడి అటవీ కార్మికులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రసంగించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన కార్మిక వ్యతిరేకంగా తయారైందని, ధార్మిక సంస్థ టీటీడీలోనూ ఈ ధోరణులు పెరిగి పోయాయని విమర్శించారు. తిరుమల కొండ పచ్చదనానికి కారకులైన అటవీ కార్మికుల పట్ల టిటిడి యాజమాన్యం మొండివైఖరిని సమాజం యావత్తు ఏవగించు కునేటట్టు ఉందని గుర్తు చేశారు. 30 సంవత్సరాల పాటు సేవలందించిన అటవీ కార్మికుల్లో అత్యధికులు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే 12 మంది మరణించారని అయినా టీటీడీ యాజమాన్యానికి కనికరం కలగకపోవడం క్షంతవ్యం కాదని విమర్శించారు. తాజాగా అంగన్వాడీల పోరాటాన్ని నిర్వహించిన సిఐటియు దీనికి నాయకత్వం వహిస్తున్న విషయాన్ని టిటిడి యాజమాన్యం గుర్తుంచుకోవాలని అన్నారు. టీటీడీ బోర్డులో కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నం జరుగుతుందన్న విశ్వాసం కల్పించాల్సిన అవసరం చైర్మన్ కరుణాకర్ రెడ్డి పై ఉందని, ఇటీవల కొన్ని సమస్యలు పరిష్కరించారని, దీర్ఘకాలంగా పోరాడుతున్న అటవీ కార్మికుల విషయం ఎందుకు పట్టించుకోవడంలేదని... దీనికి కుట్ర దారులు ఎవరైనా ఉన్నారా? ఈ కుట్రకు పాత్రధారులు, సూత్రధారులు ఎవరనే విషయం వెల్లడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



పోలీసుల రాకతో శిబిరం వద్దకు భారీగా చేరుకున్న కార్మికులు

అఖిలపక్ష నేతల మద్దతు

ఆమరణ దీక్షా శిబిరం వద్దకు అఖిలపక్షం నేతలు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామ కృష్ణంరాజు, టిటిడి బోర్డు మాజీ సభ్యులు ఒవి రమణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, చిట్టిబాబు సంఘీభావం ప్రకటించారు. జూనియర్లను పర్మినెంట్‌చేసి, సీనియర్లను పక్కన పెట్టడం వెనుక పెద్ద కుంభకోణం జరిగి ఉంటుదని ఆరోపించారు. ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, బిఆర్ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ మద్దతు ప్రకటించారు.

మద్దతు ప్రకటించిన లాయర్లు

దీక్షా శిబిరానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాజులు, జిల్లా నేత పత్తికొండ మురళి, కె. నేతాజీ. చల్లా వెంకటయ్య, ప్రసన్న, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల సంఘీభావం

ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఇఎస్ కుమార్, జోనల్‌కార్యదర్శి భాస్కర్, ఎపి రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు మునిరత్నం, భాస్కర్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మేమలత, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఇ.వెంకటరముని, వై.కృష్ణకుమార్ సంఘీభావం ప్రకటించారు.

జిల్లావ్యాప్తంగా నిరసనలు

తిరుపతిలో అటవీ కార్మికుల నిరవధిక దీక్షకు మద్దతుగా శ్రీకాళహస్తిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 2005, 2011లో టిటిడి యాజమాన్యం సూచన మేరకు సొసైటీలు ఏర్పరచుకున్న కార్మికులను కాదని, 2013లో చేరిన జూనియర్లను పర్మినెంట్‌చేయడం ఏంటని ప్రశ్నించారు. కెవిబిపురంలో మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు రాజేశ్వరి ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు, శివకవి ముకుంద ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గూడూరు సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు సురేష్, బివి రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, పామంజి మణి పాల్గొన్నారు. పుత్తూరులో సిఐటియు నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఏర్పేడులో సిఐటియు మండల నాయకులు కరీముల్లా, రంగయ్య ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. నాయకుల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, ఏమైనా జరిగితే చూస్తూ ఊరుకోబమని, టిటిడి యాజమాన్యం స్పందించి సమస్యను సానుకూలంగా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



నాయుడుపేటలో

బలవంతపు అరెస్టులు.. దీక్ష కొనసాగింపు



దీక్ష కొనసాగింపు

నేతల ఆరోగ్యం క్షీణిస్తుందని రుయా వైద్యుల బృందం వెల్లడించడంతో పోలీసులు హుటాహుటిన సోమవారం రాత్రి 11 గంటలకు దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కార్మికులు సైతం వందలాదిగా వచ్చి పోలీసుల జులుం నశించాలి, అటవీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కందారపు మురళి సహా దీక్షల్లో ఉన్న అటవీ కార్మికులను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లడంతో, దీక్ష కొనసాగిస్తామని మొక్కవోని దీక్షతో మరో 5 మంది కార్మికులు శిబిరంలోనే పూలమాలలు వేసుకుని కూర్చోవడం గమనార్హం.

కరువు ప్రాంతాల్లో అదనపు పని దినాలు కల్పించాలి

వృకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్రంలోని అన్ని కరువు ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు అదనపు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దడాల సుబ్బారావు మాట్లాడుతూ వామపక్షాల పోరాటంతో పురుడు పోసుకుని వ్యవసాయ కూలీలకు మూడు పూట్లా పొట్ట నింపే ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులు, పనులు, వేతనాల్లో కోత పెట్టిందన్నారు. ఫలితంగా వ్యవసాయ కూలీలకు పొట్ట పోసుకోవడం గగనంగా మారిందిని వాపోయారు. రాష్ట్రంలోని అన్ని కరువు ప్రాంతాల్లో వంద రోజులకు మరో 50 రోజులు అదనంగా పని కల్పించాలని కోరారు. తిరుపతి జిల్లా బాలయ్య పల్లి మండలంలో దాదాపు 300 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందనీ, ఓ రెడ్డి సాగు బడిలో ఈ భూములంతా ఉన్నాయనీ, ఆ భూములన్నిటిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 31వ తేదీ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాలయ్యపల్లి మండల కేంద్రంలో భూ పోరాటానికి వ్యవసాయ కూలీలు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హెూదా, హక్కులపై జగన్ ప్రభుత్వం తో పాటు ప్రతిపక్షాలైన టిడిపి, జనసేన, బిజెపిలు నోరు మెదపడం లేదనీ, రానున్న ఎన్నికల్లో ఈ పార్టీలన్నిటికీ వ్యవసాయ కూలీలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాలకష్ణ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మయూర జయరాంచౌదరిని అరెస్టు చేయాలి



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

చెరకు రైతుల బకాయిలు ఇవ్వకుండా ఎగ్గొట్టిన మయూర సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం జయరాంచౌదరిని అరెస్టు చేయాలని రైతుసంఘం ఆధ్వర్యంలో ఎస్‌పికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ 2018 సంవత్సరానికి చెరకు తోలిన రైతులకు ఇప్పటివరకు బకాయిలు చెల్లించలేదని వాపోయారు.ఎన్నో పోరాటాల ఫలితంగా కలెక్టర్ చొరవ చేసి 16 కోట్లు ఇప్పించారని, మిగతా 30 కోట్ల బకాయిల కోసం వేలం వేయడానికి ప్రయత్నించగా స్టేఆర్డర్ తెచ్చి ఆపేశారన్నారు. ఆ కేసులో రైతులు ఇంప్లేట్ అయినప్పటికీ కేసు ముందుకు నడవడం లేదని, ఇప్పటికే ఐదు సంవత్సరాలు గడుస్తుందని, ఇంకా ఎన్ని సంవత్సరాలు ఎదురుచూడాలని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వడ్డీలకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, చౌదరిని అప్పుడగడానికి వెళ్లిన రైతుల్ని కులం పేరుతో దూషించినందుకు బి .యన్. కండ్రిగలో అట్రాసిటీ కేసు నమోదయిందనీ, అంతేకాక పోరాట ఒత్తిడిని తట్టుకోలేక ఒక సందర్భంలో 15కోట్లు చెక్కు ఇచ్చారనీ అది బౌన్స్ అయ్యిందన్నారు. ఈ రెండు కేసులు మీద ఆయన్ని అరెస్టు చేయాలన్నారు. రైతుల్ని ఇన్ని రకాలుగా బాధిస్తున్న జయరాం చౌదరిని అరెస్టు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆమె ఎస్పీకి విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో భాస్కర్ నాయుడు, విజయ్ కుమార్, గంగుల నాయుడు ,శంకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం ,రేణుకమ్మ సాంబశివరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిగి పోడానికి 'సిద్ధం' :టిఎన్‌టియుసి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సీఎం జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి దిగిపోవడానికి సిద్ధమయ్యారని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టి మొక్కల రఘురామరాజు విమర్శించారు. టెక్కలి నుంచి కుప్పం వరకు బస్సు యాత్ర చేపట్టారు. అందులో భాగంగా తిరుపతికి సోమవారం బస్సు యాత్ర చేరుకుంది. ఎన్టీఆర్ విగ్రహం టౌన్ క్లబ్ వద్ద టిఎన్టియుసి నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామరాజు, టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ బస్సు యాత్రకు మంచి ఆదరణ లభించింది అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, ముఖ్యమంత్రి పదవిలో సీఎం జగన్ కూడా విసిగిపోయారని, ఆ పదవి నుంచి దిగిపోవడానికి జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దాదాపు అన్ని విధాలా ఫెయిల్యూర్ అయ్యిందన్నారు. తిరుపతి పార్లీమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ , టిడిపి నాయకులు బుల్లెట్ రమణ, ఆముదల తులసీరామ్, టిడిపి నగర కార్యదర్శి చినబాబు, మాజీ కౌన్సిలర్ యశోదమ్మ, ఆంబూరు సింధుజ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోట



నెల్లూరు జిల్లా కలెక్టర్ల కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పెండింగ్ డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పిఆర్‌సి అరియర్స్‌ను వెంటనే అందజేయాలని, 70 ఏళ్ళ నిండిన వారికి 10 శాతం, 75 నిండిన వారికి 15శాతం పునరుద్ధరించాలన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, సంఘం అధ్యక్షులు గౌస్‌బాషా, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, సీనియర్ నాయకులు బాబు రెడ్డి పాల్గొన్నారు.

ఫారెస్టు కార్మికుల సమస్యను పరిష్కరిస్తాం

టిటిడి చైర్మన్ భూమన హామీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న ఫారెస్టు కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం అన్నమయ్య భవన్‌లో పాలకమండలి సమావేశం కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. రూ.5.141.74 కోట్ల టిటిడి వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వివరించారు. అనంతరం విలేకరులు అటవీ కార్మికుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. టిటిడి ఫారెస్టు కార్మికుల సమస్యను మానవతా దృక్పథంతో ఆలోచిస్తున్నామని, వారి సమస్య పరిష్కారానికి ముగ్గురు టిటిడి ఉన్నతాధికారులతో హైలెవల్ కమిటీని నియమించినట్లు చెప్పారు. మంగళవారం ఫారెస్టు కార్మికులతో, యూనియన్ నాయకులతో సంప్రదించి, వారి డిమాండ్లను కమిటీ సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయబద్ధంగా సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ సమావేశంలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి ఉన్నారు.

ఎఫ్ఎంఎస్ కార్మికుల విజయం

కొత్త నిబంధనలు రద్దు చేస్తూ బోర్డు నిర్ణయం

ఆందోళన విరమణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టిటిడి ఎఫ్ఎంఎస్ కార్మికుల పోరాటానికి యాజమాన్యం దిగివచ్చింది. హెల్త్ టెండర్ల కొత్త నిబంధనలను రద్దు చేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. దీంతో కార్మికులు ఆందోళనను విరమించారు. సిఐటియు ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎస్ కార్మికులు రెండు రోజులుగా టిటిడి పరిపాలనా భవనం వద్ద ఆందోళన చేస్తున్న విషయం విదితమే. సోమవారం జరిగిన టిటిడి పాలకమండలి సమావేశంలో హెల్త్ టెండర్ల కొత్త నిబంధనలను ఉపసంహరిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. బోర్డు నిర్ణయాన్ని స్వాగతిస్తూ సోమవారం సాయంత్రం కార్మికులు ఆందోళనను విరమించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు టి.సుబ్రమణ్యం వెల్లడించారు. సోమవారం ఉదయం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు వీరి శిబిరం వద్దకు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు.41 ఏళ్ళు పైబడిన వారు వద్దని, 30శాతం మహిళలు, 70 శాతం పురుషులు ఉండాలని, సూపర్‌వైజర్లకు శానిటరీ సర్టిఫికేట్ ఉండాలని తాజా టెండర్లలో టిటిడి నిబంధనలు సరికాదన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, టిటిడి ఉద్యోగ సంఘం మాజీ నాయకులు మునిరాజా, నాయకులు వేణుగోపాల్, బుజ్జమ్మ, ఎఫ్ఎంఎస్ సంఘం నాయకులు త్యాగ, రఘు, రవి,పార్థసారథి పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సిహెచ్ నర్సింగరావు

రూ.5,141.74 కోట్లతో టిటిడి వార్షిక బడ్జెట్

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంపు
- స్విమ్స్‌లో 1500 పడకల పెంపుకు ఆమోదం
- ధర్మప్రచారంలో భాగంగా మహిళలకు మంగళసూత్రాలు
- టిటిడి అనుబంధ ఆలయాల్లో పోస్టుల భర్తీ
- టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,141.74 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్టు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. ఛైర్మన్ అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. భూమన కరుణాకర్‌రెడ్డి నిర్ణయాలను వెల్లడిస్తూ మతమార్పిడి జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు ధర్మప్రచారంలో భాగంగా బంగారు మంగళసూత్రాలు 5 గ్రాములు, 10 గ్రాముల్లో తయారు చేసి నాలుగైదు డిజైన్లలో విక్రయించనున్నట్లు తెలిపారు. లక్ష్మీకాసులను తయారు చేసి ఎలాంటి లాభాపేక్ష లేకుండా విక్రయిస్తామన్నారు. మహిళలకు ఇది స్వామివారి కానుకని అన్నారు.

- టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద అదనంగా కేటాయించిన 132.05 ఎకరాల స్థలంలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు టెండరు ఆమోదం.
- టీటీడీ పోటు విభాగంలోని 70 మంది కాంట్రాక్టు లడ్డూ ట్రే లిఫ్టింగ్ సెమి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా మార్పు చేసి వారి వేతనాలను రూ.12,523 నుండి రూ.15 వేలకు పెంచేందుకు ఆమోదం.
- అన్నదాన విభాగంలో 138 మంది క్లీనర్లు, 79 మంది వంట మనుషులను స్కిల్డ్ కేటగిరీలోకి మార్చి వారి వేతనాలను రూ.17 వేల నుండి రూ.22 వేలకు పెంపు.
- ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేసే కార్మికులను అన్‌స్కిల్డ్ నుండి స్కిల్డ్ కేటగిరీలోకి మార్పు.
- శ్రీ వెంకటేశ్వర శిల్ప కళాశాలలో వివిధ దేవతామూర్తుల శిల్పాలను తయారుచేస్తున్న శిల్పుల కళానైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా, వారి వేతనాల పెంపుదలకు ఆమోదం.
- కలంకారి కళలో నిపుణులైన మునస్వామిరెడ్డి వేతనం రూ.25 వేల నుండి రూ.39 వేలకు పెంపు.



- టీటీడీ అనుబంధ, విలీన ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అర్చకులు, సంభావన అర్చకుల వేతనాలను రూ.26 వేల నుండి రూ.31 వేలకు పెంచేందుకు ఆమోదం.
- టీటీడీ స్టోర్‌లో పనిచేసే 9 మంది వర్కర్లకు వారి వేతనం రూ.9 వేల నుండి రూ.15 వేలకు పెంచడం జరిగింది.
- ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ద్వారా సేవలందిస్తున్న క్రమాపాఠీలకు రూ.16 వేల నుండి రూ.22 వేలకు, ఘనాపాఠీలకు రూ.17 వేల నుండి రూ.25 వేలకు సంభావన పెంపు. 1400 మంది వేదపారాయణదారులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ రూ.10 వేల నుండి రూ.12 వేలకు పెంపు. టీటీడీ ఆధ్వర్యంలోని ఆరు వేద పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 51 మంది సంభావన అధ్యాపకుల వేతనాలను రూ.35 వేల నుండి రూ.54 వేలకు పెంచేందుకు ఆమోదం.
- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 26 స్థానికాలయాలు, విలీనం చేసుకున్న 34 ఆలయాల్లో 227 వేదపారాయణందారు, అధ్యాపక, మేళం సిబ్బంది పోస్టులు, టీటీడీ విలీనం చేసుకున్న ఆలయాల్లో 288 అర్చక, పరిచారిక, పోటు వర్కర్, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్, వేదపారాయణందారు, మేళం సిబ్బంది పోస్టులు ఉన్నాయి.
- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న 300 పడకలను 1200 పడకలకు పెంచుతున్నాం. అదేవిధంగా 30 ఏళ్ళ క్రితం నిర్మించిన ఆసుపత్రి భవనాలను పెరుగుతున్న రోగుల అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించేందుకు రూ.148 కోట్లతో టెండరు ఆమోదం.
- తిరుమలలోని ఆకాశగంగ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివద్ధి చేసేందుకు రూ.30.71 కోట్లతో టెండరు ఆమోదం.
- రూ.2.28 కోట్లతో సప్తగిరి సత్రాలు-6, 7 బ్లాకుల అభివృద్ధి పనుల కోసం టెండరు ఆమోదం.
- తిరుమలలోని శ్రీవేంకటేశ్వర, ఆదిశేషు, శంకుమిట్ట విశ్రాంతి గహాల అభివద్ధి, పెయింటింగ్ పనుల కోసం రూ.10.90 కోట్లు మంజూరుకు పరిపాలన అనుమతికి ఆమోదం.
- ఆకాశరాజు నిర్మించిన అతిప్రాచీనమైన నారాయణవనంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ఆలయానికి రాజగోపురం, రాతిప్రాకారం నిర్మాణానికి రూ.6.90 కోట్లు మంజూరుకు ఆమోదం.
- శ్రీవారి పాదాల చెంత ఉన్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఇకపై శ్రీ పద్మావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌గా రూపుదిద్దుకోనుంది.
- సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఐదేళ్ల కాలపరిమితికి గాను ఒరాకిల్ ఫ్యూజన్ క్లౌడ్ ఇఆర్‌పి ప్రవేశపెట్టేందుకు ఆమోదం.
- తిరుమల అన్నమయ్య భవనం సమావేశ మందిరం ఆధునీకరణలో భాగంగా దృశ్యశ్రవణ అనుసంధాన పరికరాల ఏర్పాటుకు ఆమోదం.
- ఫిబ్రవరి 3-5 తేదీల్లో తిరుమల ఆస్థాన మండపంలో 57 మంది పీఠాధిపతులతో ధార్మిక సదస్సు జరగనుంది.

ఈ సమావేశంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వాహనాల నడిపేవారు జాగ్రత్తలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎంవిఐ సునీల్ పేర్కొన్నారు. గూడూరులో రహదారి భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఎంవిఐ సోమవారం ప్రారంభించారు. పలువురు డ్రైవర్లు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ సునీల్ మాట్లాడుతూ రహదారి భద్రత ఉత్సవాల్లో భాగంగా భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాల నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రహీం, డాక్టర్లు, డ్రైవర్లు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు కాంగ్రెస్ కార్యాలయంలో తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు పంట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో గూడూరు పట్టణ కాంగ్రెస్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గూడూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా నని మేల భాస్కరరావు , పట్టణ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పర్వతాల శ్రీను, మెదూరు శ్రీనివాసాచారిని తిరుపతి జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ తోనే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల చంద్రశేఖర్, తిరుపతి జిల్లా సెక్రెటరీ చిలుకూరు వేమయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బండి భాస్కర్ రెడ్డి, కలువాయి మండల అధ్యక్షులు చిన్నయ్య పాల్గొన్నారు.

ఆదిమూలం వ్యాఖ్యలపై వైసీపీ నేతల ఆగ్రహం

ప్రజాశక్తి- బి యన్ కండ్రిగ: నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలం మంత్రి పెద్దిరెడ్డి పై చేసిన వ్యాఖ్యలపై మండల వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు కంచన పుత్తూరు గురవయ్య, మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి గురించి మాట్లాడే అర్హత ఆదిమూలానికి లేదని, ఆయన పెట్టిన బిక్షతో నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే గా గెలిచారని, వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ఉగ్గుమూడి గురునాధం, గోపాలరెడ్డి, కంచన పుత్తూరు గురవయ్య, సోషల్ మీడియా నియోజక వర్గ కో కన్వీనర్ ప్రసాద్ పాల్, సాయి నాయుడు తలరివెట్టు సర్పంచ్ ప్రసాద్ ,మ్యూనిరత్నం, రాజశేఖర్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకు ఘన నివాళి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఉద్యోగి అయిన యువకుడు వీర రాఘవులుకు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం నివాళులు అర్పించారు. గత ఏడాది సెప్టెంబర్ 17న తన సొంత గ్రామం పార్లపల్లి నుంచి శ్రీకాళహస్తికి వెళుతుండగా తంగేళ్ళపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీర రాఘవులు మృతి చెందాడు. ఆ యువకుని జయంతి సందర్భంగా పార్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ పెద్దల సమక్షంలో పిల్లలకు పలకలు , ప్యాడ్లు, ప్లేట్లను అతని జ్ఞాపకార్థం అతని తల్లి దండ్రుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో యువకుని తల్లిదండ్రులు నన్నూరు మాతయ్య, జ్యోతి, వైస్ ఎంపీపీ బండి మునికృష్ణా రెడ్డి, మాజీ సర్పంచ్ నన్నూరు పెంచలయ్య, యన్.హరినాథ్ , ఎన్ పెంచలయ్య, యువకుని మేనమామ వీర రాఘవులు(టీచర్), ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2024 ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామమే: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 2024 ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కురుక్షేత్ర సంగ్రామాన్ని తలపిస్తాయని టిడిపి తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ తన నోటితోనే ప్రజలు ఇంటికి పంపిస్తే వెళ్లిపోతాను అన్నాడనీ, అంటే జగన్ ఇంటికి పోవడానికి 'సిద్ధం' గా ఉన్నాడన్నారు. యువతను గంజాయి మత్తులో తూలింప చేస్తూ వారి భవిష్యత్తు నాశనం చేశారని, జే బ్రాండ్ మద్యంతో రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల మంది ప్రజలను రోగాల బారిన పడేలా చేశారని, ఇదేనా మద్యపాన నిషేధం అంటూ జగన్ సర్కార్ వైఖరిని తనదైన శైలిలో ఎండగట్టారు. తిరుపతిలో అభివృద్ధి అంటే అభినయ్, అభినయ అంటే తిరుపతి సమగ్ర అభివృద్ధి అన్నట్టుగా చూపుతున్నారని, మేయర్ పాత్ర ఏమీ లేదా? అని వైసిపి తీరును ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సురా సుధాకర్ రెడ్డి, మునిశేఖర్ రాయల్, బుల్లెట్ రమణ, సింగంశెట్టి సుబ్బరామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ క్యాలెండరు ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సీఎం జగన్ విద్యా ప్రదాతగా నిలుస్తున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీయూ వైఎస్సార్ స్టూడెంట్స్ విభాగం అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ను డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ముని ,నరేష్ ,సాయి, వినోద్ ,రవి, మనోజ్, బోస్, కాశి, ప్రసన్న ,హరి, గౌతమ్ ,చందు, లిఖిత్ పాల్గొన్నారు.

గడపగడపకు విశేష స్పందన



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గాంధీ పురం పంచాయతీ వైఎస్ఆర్ సి పి అధ్యక్షులు గురువారెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి చేపట్టిన గడపగడప కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గాంధీ పురం పంచాయతీ ధనలక్ష్మి నగర్, గాంధీపురంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చెవిరెడ్డి లక్ష్మి ఇంటింటికి వెళ్లి కరపత్రం అందజేసి, తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆదరించే గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు స్పందిస్తూ పంచాయతీ ప్రజలు ఎప్పుడు రుణపడి ఉంటామని, రాబోవు ఎన్నికల వైఎస్ఆర్సిపి కి పూర్తి మెజార్టీ కట్ట పెడతామని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ జయాకర్, సర్పంచి మున్నూరు శివ, వైయస్సార్సీపి నాయకులు పాకాల గోపి, వార్డు మెంబర్ శశి కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'తెలుగుగంగ నీరు విడుదల చేయండి'

ప్రజాశక్తి -తొట్టంబేడు : తెలుగుగంగ నీటిని విడుదల చేయాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో అధికారులు తెలుగుగంగ నీటిని ఆపేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తొట్టంబేడు మండల పరిధిలోని బోనుపల్లె, కంచనపల్లె, గిలకసముద్రం, తుమ్మలగుంట, చిట్టత్తూరు. కారాకొల్లు, అగ్రహారం, కాసరం, కనపర్తితో పాటు తెలుగుగంగ పరీవాహక ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయని, తుపాను కారణంగా వర్షం అధికంగా పడి చెరువులు దెబ్బతినడంతో ప్రస్తుతం నీటి సమస్య ఏర్పడిందన్నారు. గంగ నీటిని విడుదల చేసి అన్నదాతను ఆదుకోవాలని కలవగుంట భరత్ రెడ్డి కోరారు.

ఘనంగా సిపాయి జన్మదినం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎమ్మెల్సీ, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పలుచోట్ల భారీ కేకులు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు రెడ్డి, దాము రెడ్డి, బాలాజీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని తంగెళ్ళపాలెం పంచాయతీ,గౌడమాల గ్రామంలో కరెంట్ స్తంభాలు లేక కర్రలు పెట్టుకొని కరెంటు వైర్ లాక్కున్నామని మా ఊరిలో చిన్న పిల్లలకు ఎప్పుడు ఎ అపాయం కలుగుతుందో తెలియక బతుకుతున్నాం' అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డికి విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే గ్రామానికి పోల్స్ వేసి లైన్ వేయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కుమార్తె పవిత్ర రెడ్డి సోమవారం దగ్గర ఉండి పోల్స్ ఏర్పాటుచేసి లైన్లను లాగి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, వెంకటయ్య, రమణయ్య,నాగరాజు,సుబ్రమణ్యం, బత్తయ్య, పాల్గొన్నారు.

నేడు ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్‌పై అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం చింతలపాలెం లో అడిషనల్ డీజీ, సిఐడి ఆదేశాల మేరకు నేడు ఎస్సీ ఎస్టీ యాక్ట్ (పి ఓ ఏ) అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఏర్పేడు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో స్టిక్కర్లు, పోస్టర్లకు పన్నులు కట్టుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలంలో తమ ఐడిపి కార్యకర్తలు స్వచ్ఛందంగా వారి సొంత ఖర్చులతో స్టిక్కర్లను,పోస్టర్లను, బ్యానర్లను వారి ఇళ్లకు వేసుకోవటానికి అనుమతించాలని ఎంపీడీవో బాలాజీ నాయక్ కు సోమవారం చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మండల పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో ఏవైనా బ్యానర్లు గాని పోస్టర్లు వేస్తే దానికి పన్నులు కట్టించుకోవటానికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. అధికార పార్టీ ఒత్తిడిలకు లోనై, వారి మెప్పు పొందటానికి అత్యుత్సాహం ప్రదర్శించి ళ్లకు వున్న స్టిక్కర్లు, పోస్టర్లపై చర్యలు తీసుకుంటే తాము ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దుస్థితిలో వంతెనలు

స్పందించని అధికారులు

ప్రజాశక్తి- నారాయణవనం: గత నెల కురిసిన తుపాను వర్షానికి మండలంలో వరదల ఉధృతం కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగాయి. దీంతో వంతెనలు కొట్టుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెరువులకు స్వల్ప గండ్లు పడ్డాయి. నెల రోజులు పైనే అవుతున్నా ఇప్పటికీ తెగిన వంతెనలకు పూర్తి స్థాయిలో ఎలాంటి మరమ్మతులు చేయలేదు. గండ్లు పడ్డ చెరువులకూ పూర్తి స్థాయిలో మరమ్మతులకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. భవిష్యత్తులో మళ్లీ వరదల సమయంలో ఇలాంటి దుస్థితి ఎదురయ్యే ప్రమాదం వుంది స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరదలకు మండలంలో పలు కాజ్‌వేలు, వంతెనలు దెబ్బతిన్నాయి. కొన్ని పాక్షకంగా దెబ్బతినగా, మరికొన్ని చిన్నాభిన్నమై రాకపోకలను స్తంభింప చేశాయి వర్షాలు తగ్గిన అనంతరం తాత్కాలికంగా మట్టిని వేసి ప్రజా ప్రతినిధులు చేతులు దులుపుకున్నారు. శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికాలు స్పందించాలని కోరుతున్నారు.

నారాయణవనం మండలంలో తుంబూరు వద్ద అరుణ నదిపై ఇరవై ఐదేళ్ల క్రితం నిర్మించిన పాత వంతన గత ఏడాది వర్షాలకు కొట్టుకుపోయింది. పైపులు అమర్చి మట్టి పోసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. భారీ వర్షాలు వస్తే ఈ వంతెన సైతం కొట్టుకుపోవడం ఖాయమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి పోసిన కారణంగా వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. తుంబూరుకు అటు వైపు వున్న పలు గ్రామాల రైతులు చెరుకులోడ్‌లను తీసుకెళుతున్న సమయంలో వంతెనపై వున్న గుంతల్లో ట్రాక్టరు చక్రాలు దిగి బోల్తా పడిన సందర్భాలు వున్నాయి. ఈ కారణంగా చెరుకు లోడ్‌లను ఇటు తీసుకెళితే ఏ ముప్పు ముంచుకొస్తుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వంతెనపై చెరువు మట్టి తోలడంతో తేలికపాటివర్షం పడితే బురదమయంగా పాదచారులు, ద్విచక్రవాహనదారులు జారి పడే ప్రమాదం వుందని వాపోతున్నారు. ఇదే గ్రామంలో వున్న చెరువుకు గత ఏడాది వర్షాల కారణంగా చెరువు పూర్తి స్థాయిలో నిండి తూములు పనిచేయకపోవడంతో ఎగువ భాగం వెళుతూరు కండ్రిగ వద్ద చెరువుకు గండి పడి నీరు ఏటి పాలైంది.ఆ సమయంలో ఇసుక బస్తాలతో ఈ చెరువు గట్టుకు అడ్డుకట్టవేసి తాత్కాలికంగా నీటిని సంరక్షించారు. ఈ సారి పెద్ద వర్షాలు పడితే ఈ చెరువుకు పెద్ద గండి పడి నీరు కొట్టుకుపోయి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం వుంది. అధికారులు వెంటనే స్పందించి చెరువుకు గండి పడిన ప్రదేశంలో శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సి వుంది.

మండలంలోని పాలమంగళం ఉత్తరం మార్గంలోనూ వంతెన అసంపూర్తిగా దర్శనమిస్తోంది. తిరువట్యం వద్ద పాత వంతెన శిథిలమయింది. వర్షాలు వస్తే ఈ గ్రామాల ప్రజలు ఇళ్లలోకి పరిమితం కావాల్సి ఉంది. సంబంధిత శాఖల అధికారులు వంతెనలకు, చెరువు గట్టుకు శాశ్వత మరమ్మతులు చేయాల్సిన అవసరం వుంది.

దళితుల భూమిని అగ్రవర్ణాలకు కేటాయించారు

బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దాదాపు 25 సంవత్సరాలకు పైగా నారాయణవనం అరణ్య కండ్రిక పంచాయతీ చిత్తూరు కండ్రిగ మాదిగ వాడ ప్రజలు గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 191/1లోని 11 ఎకరాల 75 సెంట్లు పోరంబోకు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అయితే మండల తహశీల్దారు ప్రమీలమ్మ ఇదే పంచాయతీకి చెందిన అగ్రకులాల వారికి పంచి పెట్టారని గ్రామస్తులు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమిలేని నిరుపేద దళితులకు భూమి కేటాయించాల్సింది పోయి అగ్రకులాల వారికి కొమ్ముకాస్తూ వారి దగ్గర డబ్బులు తీసుకుని భూములు కేటాయించడం సమంజసం కాదన్నారు. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో స్పందనకు ఇచ్చిన ఉన్నతాధికారులకు తహశీల్దారు ప్రమీలమ్మ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. అరణ్య కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన జయరాం నాయుడు, మల్లీశ్వరి, భాగ్యమ్మ, విజయ, జయచంద్ర నాయుడులకు 11 ఎకరాల 75సెంట్ల స్థలాన్ని అప్పగించారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చిత్తూరు కండ్రిగ మాదిగ వాడ ప్రజల సాగు చేసుకుంటున్న భూమిని వారిని సాగు చేసుకునేలా తగిన ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంతమ్మ, మునెమ్మ, నాగభూషణమ్మ, చెంగమ్మ, నీలమ్మ, లక్ష్మమ్మ, వెంకటమ్మ, పరిమళ నందిని పాల్గొన్నారు.

బోధన, పరిశోధనా ప్రమాణాలు పెంచాలి: విసి



మాట్లాడుతున్న శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : లైఫ్ సైన్సెస్ లో బోధన, పరిశోధన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి భారతి పిలుపు నిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో డిబిటి బిల్డర్, రీసెర్చ్ డెవలప్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో " హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఆన్ జీనోమిక్స్ అండ్ బయోలాజికల్ డేటా బేసిస్ " అనే అంశం పైన హైబ్రిడ్ మోడ్ లో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ సోమవారం సావేరి సెమినార్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్సిటీ విసి ఆచార్య డి. భారతి మాట్లాడుతూ లైఫ్ సైన్సెస్ విభాగాలలో విద్యా ప్రమాణాలు, పరిశోధనలు మెరుగుపరచడమే డిబిటి బిల్డర్ ముఖ్య ఉద్దేశమని, రాష్ట్రంలో ఈ స్కీం మహిళా విశ్వవిద్యాలయానికి రావడం చాలా ఆనందదాయకమన్నారు. అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ సుజాత మాట్లాడుతూ ఇలాంటి వర్క్ షాప్స్ విద్యార్థులలో పరిశోధ కులలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంచడానికి ఎంతగానో ఉపయోగపడతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్ పర్సన్, ప్రాజెక్టు కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, స్విమ్స్ బయోఇన్ఫర్మే టిక్స్ విభాగ హెడ్, ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్ ఉష, శాస్త్రవేత్తలు డాక్టరు దీప్షిక్ సతీష్, డాక్టరు సుదర్శన్ వరదరాజన్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి తప్పదు

- అటవీ కార్మికుల పట్ల టిటిడి వైఖరి తగదు
- టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు రఘురామరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను రోడ్డున పడేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని కార్మికుల ఆవేశంతో జగన్ ప్రభుత్వం ఓటమి పాలవడం ఖాయమని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామరాజు అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సోమవారం మంగళంలో టిఎన్‌టియుసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా చంద్రగిరిలో మాత్రం దొంగ ఓట్ల రాజకీయం ఎక్కువైందని, పులివర్తి నాని చంద్రగిరి నుండి గెలవడం ఖాయం అన్నారు. కార్మికులకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను మూసివేసి కార్మికుల ఆకలికే కారణమయ్యారన్నారు. దాదాపు 1100 రోజులకు పైగా టీటీడీలోని అటవీ శాఖ కార్మికులు బోర్డు నిర్ణయాన్ని అమలు చేయాలని పోరాటం చేస్తుంటే పట్టించుకోకుండా వారి కంటే జూనియర్లుగా ఉన్న వారిని పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు తేవడం కార్మిక వర్గాలను కూడా విభజించి పాలించు అనే సూత్రంతో చూస్తున్నారని తేటతెల్లమవు తుందన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం సాధించే లక్ష్యంతో 2029 లో వైసిపి భయపడేలా ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి తిరుపతి జిల్లా అధ్యక్షుడు జయరాం రెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు మాధవ నాయుడు, కార్యదర్శి బాల యాదవ్, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీలు మధు, ఆముదాల తులసిరామ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కె. సుబ్రహ్మణ్యం, గోవిందరాజులు, సురేష్, జనసేన నాయకులు దాము, సాయి, నవీన్, కిషోర్ పాల్గొన్నారు.

బీసీల రాజకీయ చైతన్యమే లక్ష్యం: జగన్నాథం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలోని బీసీలను చైతన్య పరచి పదవుల పరంగా, సంక్షేమం పరంగా రాజకీయ చైతన్యం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గాండ్ల సాధికార నాయకులు జగన్నాథం స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీ రామారావుకే దక్కిందని ఆ రిజర్వేషన్లతోనే రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన కులాలు అభివృద్ధి చెందాయన్నారు. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైందని, మరింత రెట్టింపు ఉత్సాహంతో బీసీలందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చి జనాభా దామాషా ప్రకారం సీట్లు కోరుతామన్నారు. 'టిడిపిలోని బీసీలు ఐక్యంగా ఉంటే లేనిపోని ఊహగానాలు పుట్టిస్తున్నారని, యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మేయర్ పదవిని ఇచ్చి పవర్ ఇవ్వకపోవడం అపహాస్యం కాదా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సత్తు మధుసూదన్ యాదవ్, రాజయ్య, కోనంగి శ్రీరాములు, ఆముదాల తులసీదాస్, అశోక్, ఆనంద్ యాదవ్, గంధం బాబు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని స్థానిక ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వాద్వానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "ఎంప్లాయబులిటీ స్కిల్స్" అనే అంశంపై అధ్యాపకులకు మూడు రోజుల శిక్షణ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి. విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వాద్వానీ ఫౌండేషన్ తరపున మాస్టర్ ట్రైనర్ స్వాతి పుత్రన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ఎన్.బి.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, వాద్వానీ ఫౌండేషన్ మధ్య జరిగిన అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ అధ్యాపక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు కావలసిన ఉద్యోగ నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు అవసరమైన శిక్షణ అందిస్తారని తెలిపారు. శిక్షణ పొందిన అధ్యాపకులు 3, 4 సంవత్సర విద్యార్థులకు శిక్షణ ఇస్తారని 60 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశామన్నారు. ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన స్వాతి పుత్రన్ మాట్లాడుతూ వాద్వానీ ఫౌండేషన్ గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలను వేగవంతం చేయడం, మెలకు వలపై శిక్షణ ఇస్తుందన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసిన అధ్యాపకులకు గ్లోబల్ సర్టిఫికేషన్ అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్ ఇందుమతి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- చిట్టమూరు: శ్రీ వల్లీ దేవసేన సమేత స్వయంభువు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులను దృష్టిలో వుంచుకుని అన్న ప్రసాద భవనంను టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో కిరణ్ కుమార్, సూళ్లూరుపేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి శ్వేతా, ఎన్‌డిసిసి బ్యాంక్ జిల్లా ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. అతిథులకు దువ్వూరు శేషు రెడ్డి, చిల్లకూరు సాయి కుమార్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద భవన నిర్మాణానికి విశేష కృషి చేసిన దువ్వూరు శేషు రెడ్డి, చిల్లకూరు సాయి కుమార్ రెడ్డిని వైవి సుబ్బారెడ్డి అభినం దించారు. దువ్వూరు శేషురెడ్డి ముందుకు వచ్చి ఆయన తండ్రిదువ్వూరు హనుమంత రామారెడ్డి జ్ఞాప కార్థంతోఅన్నదాన ప్రసాద భవనం నిర్మించారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబు నిరుద్యోగ ద్రోహి.. జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహి: చింతా మోహన్

ప్రజాశక్తి - తిరుపతి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైయస్సార్ ప్రభుత్వం దళిత ద్రోహి ప్రభుత్వం అని, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు నిరుద్యోగద్రోహి నిరుపేద మహిళా ద్రోహి అని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. సోమవారం సాయంత్రం 'ఇంటింటికి కాంగ్రెస్ 'లో భాగంగా అన్నారావు సర్కిల్ నుంచి కపిల్ తీర్థం రోడ్డు, చిన్న బజారు వీధి, గాంధీ రోడ్‌లలో ఆయన పర్యటించారు. 'మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి' అనే కార్యక్రమం కి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఆయన తెలిపారు. కోడి కత్తి ఘటన సీన్లో కత్తేలేదని, అదంతా ఎన్నికల కోసం, ఓట్ల కోసం సానుభూతి కోసం ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు వైసిపి ఆడిన డ్రామా అని మండిపడ్డారు. అమాయకుడైన దళిత యువకుడు శీనును ఐదు సంవత్సరాలుగా జైల్లో నిర్బంధించడం శోచనీయమన్నారు. జగన్ చొక్కాకు అంటిన రక్తం పోరన్ సిక్ ల్యాబ్ పంపి వాస్తవాలు నిగ్గు తేల్చాలని చింతా మోహన్ డిమాండ్ చేశారు.తిరుపతిలో 7008 మంది నిరుపేద మహిళలకు ఇళ్లు ఆపి చంద్రబాబునాయుడు నిరుపేద మహిళా ద్రోహిగా మారాడని, లక్ష మంది నిరుద్యోగులకు మంచి ఉద్యోగాలు వచ్చే దుగరాజపట్నం ఓడరేవును దుఃఖరాజపట్నం ఓడరేవుగా మార్చారని విమర్శించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత లోపిస్తే చర్యలు: ఎంఈవో



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవోలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంఈవోలు హెచ్చరించారు. మండల కేంద్రంలోని కొత్త కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థిలు పాఠశాలలకు రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పథకాలను విద్యార్థి తల్లిదండ్రులకు వివరించారు. నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ముని సుబ్రహ్మణ్యం పదో తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రం సబ్జెక్టు పై అవగాహన కల్పించారు.

తడ: మండలం లో సోమవారం విద్యాశాఖాధికారి 2 మల్లికార్జున రావు ఉదయం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పెద్ద మాంబట్టు ను సందర్శించి విద్యార్థులకు సలహాలు సూచనలు అందించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సాధన పుస్తకాలను, సిలబస్ ప్రకారం రాయించి వాటిని దిద్దించాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సి బి ఏ2 పరీక్షకు సంబంధించిన ఓఎంఆర్‌లను మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయానికి చేర్చాలని సూచించారు.

క్రైం న్యూస్

నీటి గుంటలో మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని ఉచ్చూరు గ్రామ సరిహద్దులో గుడిగుంట నీటిలో చనిపోయిన మృతదేహాన్ని ఆ గ్రామస్తులు ఆదివారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై స్పందించిన ఎస్ఐ తిరుమలరావు సంఘటన స్థలంలో చనిపోయి ఉన్న మృతదేహాన్ని పరిశీలించి, మృతుడి వ్యక్తి వివరాలను ఆరా తీయగా సమీప గ్రామమైన సూళ్లూరుపేట మండలం, గళంపాడు గ్రామానికి చెందిన నివాసిగా గుర్తించామని తెలిపారు. మృతడు ఓడెం హరినాథ్(47) అయి ఉంటాడని వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతుడి భార్య సమాచారం మేరకు మృతుడి శరీరంపై వేసుకున్న దుస్తులను గుర్తించి చనిపోయిన వ్యక్తి తన భర్త అని లబోదిబోమని విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు మేరకు తాము నిరుపేదళం తన భర్త కూలి పనికని వెళితే రెండు మూడు రోజులు కూడా తిరిగి ఇంటికి వచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఇదే క్రమంలో రెండు రోజుల క్రితం పనికి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాకుండా చనిపోయి విషయం గ్రామస్తులు చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టం అనంతర మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులపై గంజాయి బ్యాచ్ దాడి

ఏడుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: విధుల్లో బాగంగా లైన్ పై వెళుతున్న విద్యుత్ ఉద్యోగులను ఓ గంజాయి బ్యాచ్ అటకాయించి ఉన్నట్లుండి దాడి చేయడంతో ఏడుగురు కార్మికులు గాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథలు మేరకు రేణిగుంట పరిధిలోని విద్యుత్ మరమ్మతులను సరి చేసేందుకు పది మందితో కూడిన బ్రేక్డౌన్ గ్యాంగ్ ను విద్యుత్ సంస్థ ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ వారి పరిధిలోని లైన్లను ఇస్కాన్ కు సంబంధించిన 407 వాహనం ద్వారా పరిశీలించి సరి చేయడం వారి విధి..అందులో భాగంగా సోమవారం లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులతో కలిసి పది మందితో కూడిన బృందం విధుల్లో భాగంగా వారి పరిధిలోని లైన్ పైకి వెళ్లారు. సాయంత్రం విధులు ముగించుకొని రేణిగుంట లోని జ్యోతి నగర్ వద్ద వచ్చే సమయంలో రోడ్డు పక్కన ఓ గదిలో గంజాయి పీల్చుతున్న ముఠాలోని ఓ వ్యక్తి రోడ్డుపై వెళ్తున్న వాహనానికి అడ్డుగా వచ్చిన నిలబడ్డాడు. వాహనంలోని విద్యుత్ సిబ్బంది పక్కకు వెళ్లాలని 407 వాహన డ్రైవరను చితకొట్టారు. అందులోని సిబ్బంది ప్రశ్నించడంతో, పక్క గదిలోనే గంజాయి పీల్చుతున్న ఆ ముఠా సభ్యులందరూ మూకుమ్మడిగా దాడి చేసి, ఏడుగురిని చితకొట్టారు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో వారు పరారయ్యారు. అందులో ఓ వ్యక్తిని పట్టుకొని స్థానికులు పోలీసులకు అప్పగించారు. గాయాలు పాలైన ఉద్యోగులు రవి, ఉదయ్, దాము, శంకర్, రమణ, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది ఫిర్యాదు మేర కు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఒకవైపు అనుమానం.. మరోవైపు ప్రశ్నించడాన్ని ఓర్వలేనితనం వెరసి కట్టుకున్నోడే భార్య పట్ల కాలయముడయ్యేలా చేసింది. భార్యను హతమార్చి, తీరా ప్రమాదమని చిత్రీకరించాలని చూసి ఆపై పోలీసుల ఎదుట లొంగిపోయిన భర్తను సోమవారం శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. వన్ టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు.. వరదయ్యపాలెం మండలం పద్మావతి పురానికి చెందిన శ్రీనివాస్, పవిత్రలకు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. శ్రీనివాస్‌కు గీత తో గతంలో వివాహమైంది. ఆమెకు ఓ కుమార్తె వుంది. ఈ క్రమంలో ఇద్దరికీ విభేదాలు రావడంతో తన మామ కూతురైన పవిత్రను వివాహం చేసుకున్నాడు. ఇన్నాళ్లుగా అన్యోన్యంగా సాగుతున్న వీరి కాపురంలో రెండేళ్ల క్రితం కలతలు మొదలయ్యాయి. శ్రీనివాస్ తాగుడికి అలవాటు పడ్డాడు. పవిత్ర ఆయనను ప్రశ్నించడం మొదలు పెట్టింది. తాగుడికి అలవాటు పడ్డ శ్రీనివాస్ భార్యను అనుమానించడం మొదలు పెట్టాడు. దీంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 7వ తేదీ భార్యను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. తిరుపతిలో తానే స్వయంగా భార్యకి వైద్యం చేయించాడు. ఈనెల 23న భార్యతో కలిసి తిరిగి ఇంటికి వెళుతుండగా బస్సులో భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. దీంతో శ్రీనివాస్ భార్యను హతమార్చేందుకు వ్యూహ రచన చేశాడు. 24వ తేదీ సాయంత్రం పవిత్రను శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్లి స్నానం పేరిట పవిత్ర(35)ను నీట ముంచేసి హతమార్చాడు. అనంతరం తెలివిగా 'నా భార్య స్నానానికి వెళ్లి ఊపిరాడక చనిపోయింది...'అంటూ అత్తమామలకు సమాచారం అందించాడు. అయితే అత్తమామలు శ్రీనివాస్ చెప్పేది నమ్మశక్యంగా లేకపోవడంతో అదే రాత్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సిఐ నరసింహారావు కేసులో పురోగతి సాధించారు. దీంతో శ్రీనివాస్ తానే తన భార్యను హతమార్చానంటూ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కేసు నమోదు చేసి శ్రీనివాస్(54)ను రిమాండ్ నిమిత్తం శ్రీకాళహస్తి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సుధామణికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని కే. సుధామణికి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ విభాగానికి చెందిన ఆచార్యులు జీవన జ్యోతి పర్యవేక్షణలో "డిజైన్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ టార్గెటెడ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఫర్ ట్రీట్మెంట్ ఆఫ్ లివర్ డిసీజెస్' అనే అంశంపై పరిశోధన గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించారు. సుధామణికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.సుధామణికి డాక్టరేట్ ప్రధానం

సమస్యలపై పోరాడి పరిష్కరించుకుందాం: జనసేన

ప్రజాశక్తి -బాలాయపల్లి : సమస్యలపై పోరాడి పరిష్కరించుకుందామని జన సేన వెంకటగిరి సమన్వయ కర్త గూడూరు వెంక టేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం బాలాయపల్లి మండల అధ్యక్షుడు పగడాల వెంకటరమణ ఆధ్వర్యంలో గొట్టికాడు,పాకపూడి గ్రామం లో జనం లోకి జనసేన గడప గడప కి బాబు ష్యూరిటి భవిషత్తు గ్యారంటీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామస్తులు తమకు పలు సమస్యలు వున్నాయని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాయపల్లి మండల అధ్యక్షులు పగడాల వెంకటరమణ, పుల్లూరు గురునాథ్, పగడాల శ్రీహరి ఎల్లంపాటి బాలసుబ్రహ్మణ్యం, కిషోర్, రషీద్, పండు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో 'ఆడదాం ఆంధ్ర' క్రీడల పోటీలు గత నెల రోజులుగా జరిగాయి. ఈ ఆటల పోటీలు గెలుపొందిన వారికి బహుమతులు ముఖ్య అతిథిగా విచ్చేసిన వైసిపి వెంకటగిరి సమన్వయకర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరి బాలుర ఉన్నత పాఠశాలలో అందించారు. ఈ సందర్భంగా రాం కుమార్ రెడ్డి మాట్లాడుతూ గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా స్థాయికి రాష్ట్ర స్థాయి వరకు పాల్గొనే విధంగా సీఎం అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ నక్క భానుప్రియ కౌన్సిలర్లు, వైసీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, నియోజకవర్గ స్థాయి పిఈటిలు పాల్గొన్నారు.

జగన్‌కి దళితులంటే కపట ప్రేమ: సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసిపి అధినేత జగన్ కు దళితులన్నా, బీసీలన్న గిట్టదని శ్రీకాళహస్తి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. టికెట్ల విషయంలో దళితులు, బీసీల పట్ల జగన్ వ్యవహరిస్తున్న తీరే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో బొజ్జల సుధీర్ రెడ్డి సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు, గూడూరు, నెల్లూరు తదితర నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న ఎస్సీ, బీసీ అభ్యర్థులను మార్చిన వైసీపీ అధిష్టానం, వారి నుంచి అసంతృప్తి సెగలు వెల్లువెత్తితే ఆ నెపాన్ని టిడిపి పై తోసేయడం హాస్యాస్పదం, సిగ్గుచేటు అన్నారు.

టిడిపితోనే బడుగు.. బలహీన వర్గాల అభివృద్ధి: భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపితోనే పేద మడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని నగరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ వార్డులలో బాబు ష్యూరిటీ -భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమం లో 16 వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ బిసిఆర్ యుగంధర్,, చిత్తూరు పార్లమెంటరీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.